క్లుప్తంగా

చోడవరంలో పంట కోత ప్రయోగం



చోడవరంలో పంట కోత ప్రయోగం చేస్తున్న ఏఓ సత్యప్రసాద్, సిబ్బంది

రామచంద్రపురం రూరల్: చోడవరం గ్రామంలో బుధవారం నిర్వహించిన పంట కోత ప్రయోగాల్లో ఎకరాకు 35 నుంచి 39 బస్తాల దిగుబడి వచ్చినట్లు మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ వివరించారు. గ్రామంలోని రైతులు గునిపెల్ల సూరమ్మ, గుణ్ణం సుబ్బారావు చౌదరిలకు సంబంధించిన పొలాల్లో నిర్వహించిన పంట కోత ప్రయోగాల్లో సూరమ్మ పొలంలో 39 బస్తాల దిగుబడి, సుబ్బారావు చౌదరి పొలంలో 35 బస్తాల దిగుబడి వచ్చినట్లు అంచనాకు వచ్చామన్నారు. ఇద్దరు రైతులు కూడా ఎంటీయూ 7209 రకం పంట వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు జి.దుర్గాభవాని, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

9న సహస్ర గళ హనుమాన్ చాలీసా పారాయణ

మండపేట: ఈ నెల 9న పట్టణంలో సహస్రగళ హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్టు విశ్వహిందూ పరిషత్ సభ్యుడు, గోశాల నిర్వాహకుడు అయినవిల్లి రాజరాజేశ్వర రుద్రశర్మ తెలిపారు. ఆయన బుధవారం మీడియాకు ఆ వివరాలు వెల్లడించారు. కామేశ్వరీదేవి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గోశాల, విశ్వహిందూ పరిషత్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గొల్లపుంత టిడ్కో కాలనీకి వెళ్లే రోడ్డులోని కామకోటి త్రివేణి ఎన్‌క్లేవ్, వల్లూరి పరుశురామ్(రాంబాబు) లేఅవుట్ ప్రాంగణంలో 9వ తేదీ ఉదయం 9 గంటలకు హనుమాన్ చాలీసా సహస్రగళ పారాయణ ప్రారంభం అవు తుందన్నారు. అలాగే గోమాత పూజ, హోమాలు, యాగాలు నిర్వహిస్తామని తెలిపారు. లోక కల్యాణం కోసం చేపట్టిన ఈ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనవచ్చన్నారు. గోత్ర నామాలతో నిర్వహించే పూజలకు ముందుగా భక్తులు తమ పేర్లు నమోదు కోవాలని రుద్ర శర్మ విజ్ఞప్తి చేశారు. ముఖ్య అతిథులుగా విశ్వ హిందూ పరిషత్ పెద్దలు, స్వామీజీలు హాజరు కానున్నారని తెలిపారు.

వార్డులో దోమల మందు పిచికారీ



దోమల మందు పిచికారీ చేయిస్తున్న కౌన్సిలర్ రవికుమార్

మండపేట: దోమల వల్ల వార్డు ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని 8వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ మందపల్లి రవి కుమార్ తెలిపారు. వార్డులో బుధవారం దోమల మందు పిచికారీ చేయించారు. వార్డులో దోమల ఎక్కువగా ఉన్నాయని ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు దృష్టికి మందపల్లి తీసుకువెళ్లారు. స్ప్రేయింగ్ మెషిన్‌తో పారిశుద్ధ్య కార్మికుడ్ని పంపగా రవికుమార్ దగ్గరుండి వార్డులో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. అరుంధతీపేట, రామాలయం వీధి, ఎంపీడీవో కార్యాలయం వీధులన్నీ తిరిగి మందు పిచికారీ చేయించామన్నారు.

అధికారుల ఫోన్ నంబర్లు

రాయవరం మండలం

తహసీల్దారు	: 9849903905
ఎంపీడీవో	: 9912191666
మండల విద్యాశాఖాధికారి1	: 9948523380
మండల విద్యాశాఖాధికారి2	: 7013074928
పోలీసు స్టేషన్	: 08857235333
సబ్ఇన్‌స్పెక్టరు	: 9440904843
రాయవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు:	8309351543, 7013003149
మాచవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు :	8501002004, 8639015670
మండల వ్యవసాయాధికారి	: 8886613579
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవో	: 7702072648
డ్వాక్రా ఏపీఎం	: 9154081283
మండల ఇంజినీరింగ్ అధికారి:	9502377535
విద్యుత్‌శాఖ ఏఈ	: 9440812651
హౌసింగ్ ఏఈ	: 7093930489
మండల పశువైద్యాధికారి	: 8074154935
ఉద్యానవన శాఖ అధికారి	: 8712625211
గ్రామీణ నీటి పారుదల శాఖ ఏఈ	: 9100121182

మహిమాన్వితాలు.. ద్వాదశ తీర్థాలు

- ద్రాక్షారామకు విశిష్ట స్థానం
- దర్శించుకుంటే పుణ్యఫలమే



శ్రీమాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా ఖ్యాతికెక్కిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ద్రాక్షారామలో మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామివారి ఆలయం. ఈ ఆలయ పరిసరాల్లో స్వయంగా దేవతలు శివలింగాలను ప్రతిష్ఠించారని ప్రతీతి. ఈ ప్రాంతాలు ద్వాదశ (12) తీర్థాలుగా పెద్దలు చెబుతారు. ఆ ద్వాదశ తీర్థాల మహిమను వ్యాస మహర్షికి అగస్త్య మహాముని వివరించినట్లు భీమేశ్వర పురాణంలో రాశారు. ఈ ద్వాదశ తీర్థాలు భీమేశ్వరాలయ ప్రాంగణంలోని సప్త గోదావరీ తీరంలో 7 తీర్థాలు, సమీప గ్రామాల్లో 5 తీర్థాలు ఉన్నాయి. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఆ ద్వాదశ తీర్థాలపై 'సాక్షి' కథనం ఇది.

యోగీశ్వరీ యోగీశ్వరుడు: సప్త గోదావరి భీమేశ్వరాలయ ప్రాంగణంలోని సప్త గోదావరీ నది ఒడ్డున ఆగ్నేయంలో యోగులచే ప్రతిష్ఠించిన యోగీశ్వర క్షేత్రం.

సర్వ మంగళా సమేత ఇంద్రేశ్వరుడు: ఇంద్ర ఘట్టం (పాకశాసనస్వామి) ఇంద్రుడు ప్రతిష్ఠించిన ఇంద్రేశ్వరుడు. దానినే సప్తగోదావరీ నది ఒడ్డున ఆగ్నేయం వైపున ఇంద్ర ఘట్టం అంటారు.

సిద్ధేశ్వరీ సిద్ధేశ్వరుడు: రావిచెట్టు సిద్ధులచే ప్రతిష్ఠించబడిన సిద్ధేశ్వరుడు సప్త గోదావరి నది ఒడ్డున ఆగ్నేయం వైపున ప్రతిష్ఠించబడిన సిద్ధేశ్వర ఘట్టం.

కాళీశ్వరీ కాళేశ్వరుడు: కాళేశ్వర తీర్థం– సప్తగోదావరి (పంచాయతీ పక్కన)
భీమేశ్వరాలయ తూర్పు గోపురం ఎదురుగా సప్తగోదావరి నదీ అవతలి ఒడ్డున దేవతలచే ప్రతిష్ఠించబడిన కాళేశ్వరుడు (కాళేశ్వర ఘట్టం).

కాళీ కపాలేశ్వరుడు: సప్తగోదావరి లోపల (కపాలేశ్వర తీర్థం) ఉత్తరం వైపున భీమేశ్వరాలయానికి ఈశాన్య భాగంలో సప్త గోదావరి నది ఒడ్డున దేవతల ప్రతిష్ఠించబడిన కపాలేశ్వరుడు (కపాలేశ్వర తీర్థం).

వేదవతీ సమేత సప్తకోటి రామలింగేశ్వరుడు: బియ్యంపేట (దూడల మార్కెట్ వద్ద) భీమేశ్వరాలయానికి ఉత్తర దిక్కున శ్రీరామచంద్రునిచే రామలింగేశ్వరుడు ప్రతిష్ఠించబడ్డారు. బియ్యంపేట వద్ద రామలింగేశ్వర తీర్థం ఇది.

ఉమా సోమేశ్వరుడు:
సోమగుండం భీమేశ్వరాలయానికి వాయువ్యం దిక్కున చంద్రునిచే ప్రతిష్ఠించబడిన సోమేశ్వరుడు. దీనిని బెస్త వీధి వెనుక సోమేశ్వర తీర్థం అంటారు.

శ్రీభద్రకాళీ సమేత వీరభద్రేశ్వరుడు:
భీమేశ్వరాలయానికి నైరుతి దిక్కున దేవలచే వీరభద్రేశ్వరుడు ప్రతిష్ఠించబడ్డాడు. ఇదే నెలపర్తిపాడు రోడ్డులో వీరభద్ర తీర్థంగా ఖ్యాతికెక్కింది.

శ్రీయమేశ్వరీ యమేశ్వరుడు:
భీమేశ్వరాలయానికి నైరుతి దిక్కున దేవతలచే ప్రతిష్ఠించబడిన యమేశ్వరుడు. దీనిని నెలపర్తిపాడు రోడ్డులో యమగుండం అంటారు.

శ్రీశారదా బ్రహ్మేశ్వరుడు: బ్రహ్మగుండం– వెలంపాలెం భీమేశ్వరాలయానికి పశ్చిమ దిక్కున బ్రహ్మచే ప్రతిష్ఠించబడిన బ్రహ్మేశ్వరుడు. వెలంపాలెం గ్రామంలో బ్రహ్మగుండంగా ప్రసిద్ధి చెందింది.

శ్రీకౌమారీ కౌమారేశ్వరుడు (కుక్కుటేశ్వరుడు) : వెలంపాలెం భీమేశ్వరాలయానికి పశ్చిమ దిక్కున దేవలచే కుక్కుటేశ్వరుడు ప్రతిష్ఠింపబడ్డారు. అదే వెలంపాలెం గ్రామంలో కుక్కుటేశ్వర గుండం ఇది.

శ్రీమహేశ్వరీ మహేశ్వరుడు: భీమేశ్వరాలయానికి దక్షిణం దిక్కున దేవతలు మహేశ్వరుడిని ప్రతిష్ఠించారు. దీనినే ద్రాక్షారామ ఆకులవారి వీధిలో మహాదేవ గుండం అంటారు.



దేవస్థానం వద్ద యోగీశ్వరీ యోగీశ్వరుడు



సర్వ మంగళ సమేత ఇంద్రేశ్వరుడు- ఇంద్ర ఘట్టం (పాక శాసనస్వామి)



కాళీ కపాలేశ్వరుడు- సప్తగోదావరి లోపల (కపాలేశ్వర తీర్థం) ఉత్తరం వైపున



వేదవతీ సమేత సప్తకోటి రామలింగేశ్వరుడు- బియ్యంపేట (దూడల మార్కెట్ వద్ద)

జీతాలు చెల్లించాలంటూ 104 సిబ్బంది డిమాండ్



అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి రత్నకుమారికి వినతి పత్రాన్ని అందజేస్తున్న 104 సిబ్బంది

కపిలేశ్వరపురం: అరబిందో యాజమాన్యం తమకు బకాయి పెట్టిన వేతనాలను త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని 104 సిబ్బంది ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలో భాగంగా బుధవారం తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారికి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు కె.సాయిప్రసాద్, కె.లోవరాజు మాట్లాడుతూ 104 సర్వీసులను గతంలో మాదిరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి నిర్వహణ ఖర్చు తగ్గుతుందన్నారు. 2020లో విధుల్లోకి చేరిన సిబ్బందికి జీఓ- 7 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. మూడేళ్లగా పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లు, ఎరియర్స్ రూపంలో చెల్లించాలన్నారు. వాహనాల సీనియర్ డ్రైవర్లను వైద్యశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ యాజమాన్య వాటాను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

రేపు రాయవరం మండల సమావేశం

రాయవరం: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన ప్రారంభం అవుతుంది. ఈ విషయాన్ని ఎంపీడీవో కీర్తిస్పందన బుధవారం విలేకరులకు తెలిపారు. సమావేశానికి మండలస్థాయి అధికారులు పూర్తి సమాచారంతో విధిగా హాజరు కావాలని ఆమె సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించండి

- జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్
- ద్వారపూడిలో కొనుగోళ్లు ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

మండపేట: రైతులు తమ ఖరీఫ్ ధాన్యాన్ని దళారులు, మధ్యవర్తులకు కాకుండా, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, కనీస మద్దతు ధర పొందాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సూచించారు. మండలంలోని ద్వారపూడి- 3 రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా దశల వారీగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. ధాన్యాన్ని విక్రయించుకునేందుకు రైతు తనకు నచ్చిన మిల్లును ఎంచుకునే అవకాశం ప్రస్తుత సీజన్లో ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. రైతులు విక్రయించిన ధాన్యానికి రైస్ మిల్లర్ల తరపున బ్యాంకు గ్యారంటీ ఇచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల్లో 370 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అవసరమైన గోనె సంచులను, హమాలీలను, రవాణా వాహనాలను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందన్నారు. ఒకవేళ వాటిని రైతులే సమకూర్చుకుంటే అందుకయ్యే ఖర్చును కూడా ప్రభుత్వమే నేరుగా రైతు ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. కనీస మద్దతు ధరగా సాధారణ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,300, 75 కేజీల ధాన్యానికి రూ.1725లు, గ్రేడ్- ఏ రకానికి క్వింటాల్‌కు రూ.2320, 75 కేజీల బస్తాకు రూ.1740 గా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల, జిల్లా వ్యవసాయాధికారి వి. బోసుబాబు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ బాలసరస్వతి, జిల్లా రవాణా అధికారి డి.శ్రీనివాసరావు డీఎస్ఓ ఉదయభాస్కర్, మార్కెటింగ్ శాఖ ఏడీ కె.విశాలాక్షి, జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



టేకిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ చిన్నారావు

టేకి గ్రామంలో..

కపిలేశ్వరపురం: టేకి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ చిన్నారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని నచ్చిన రైసుమిల్లుకు విక్రయించుకోవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలపై ధాన్యాన్ని విక్రయించ దలచుకున్నవారు విధిగా బయోమెట్రిక్ వేయాలన్నారు. ఇప్పటి వరకూ మండలంలోని 14 గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు వెంకటేశ్వరరావు, పెద్దింశెట్టి నాగమణి, కార్యదర్శి రామకృష్ణ, పీఏసీఎస్ సీఈఓ చిక్కం విజయ్‌కుమార్, వ్యవసాయ సహాయకులు హరిబాబు పాల్గొన్నారు.

భీమేశ్వరుని దర్శించుకున్న మహిళా అఘోరా



ద్రాక్షారామ భీమేశ్వరస్వామి సన్నిధిలో మహిళా అఘోరా

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ క్షేత్రంలో స్వయంభూగా వెలసిన మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామిని బుధవారం ఒక మహిళా అఘోరా దర్శించుకున్నారు. ఈ విషయం తెలిసి ద్రాక్షారామ, పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో ఆమెను చూడడానికి వచ్చారు. ఆమె భీమేశ్వరస్వామిని, మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడటానికి తాను కృషి చేస్తున్నానన్నారు. గోహత్యలు, స్త్రీలపై దాడులు, దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని, ఒక్క సంతకంతో వాటిని ఆపగల ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రి ఆ పని చేయడం లేదన్నారు. ఇటువంటి వారు ప్రభుత్వంలో ఎందుకని వారిని సీట్ల నుంచి దించేందుకు తాను ప్రత్యేక పూజలు, హోమాలు చేస్తున్నానన్నారు. దమ్ముంటే తనను అడ్డుకోవాలని, వారిని సీట్ల నుంచి దించే శక్తి తనకు ఉందన్నారు. ప్రతి కుటుంబంలో ఎవరికి వారు తమ ఆడ బిడ్డలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



శలపాకలో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్

కాజులూరు: శలపాకలో ఐదు రోజుల కిందట జరిగిన దారుణ హత్యల నేపథ్యంలో కుటుంబ పెద్దలను కోల్పోయి జీవనాధారం లేక అలమటిస్తున్న బాధిత కుటుంబీకులను ప్రభుత్వం ఆదుకోవాలని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. హత్యకు గురైన బత్తుల చిన్నయ్య, బత్తుల రాజు, బత్తుల రమేష్‌ల భార్యా పిల్లలను బుధవారం సూర్యప్రకాశ్ తదితర నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అల్లర్లు, గొడవలు పెరిగిపోయి రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందన్నారు. ఫలితంగా రాజకీయాలకు సంబంధం లేని వ్యక్తులు సైతం వ్యక్తిగత గొడవలతో పరస్పర దాడులకు దిగుతూ హత్యలకు గురవుతున్నారన్నారు. శలపాక ఉదంతంలో కుటుంబాలను పోషించే భర్తలు చనిపోవటంతో వారి కుటుంబ సభ్యులు వీధిన పడ్డారన్నారు. ప్రభుత్వం స్పందించి ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒక మహిళకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు, ఎంపీపీ మాత భారతి తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి స్కూల్ హెల్త్ ప్రోగ్రాం ప్రారంభం



రాయవరం పీహెచ్‌సీని సందర్శించి, సమీక్షిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో దుర్గారావుదొర



మండపేట అర్బన్ హెల్త్ సెంటర్లో డీఎంహెచ్‌వోతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం: ఈ నెల 14 నుంచి స్కూల్ హెల్త్ ప్రోగ్రాంను ప్రారంభించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి దుర్గారావుదొర తెలిపారు. బుధవారం రాయవరం పీహెచ్‌సీకి వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తొలిదవలో 110 పాఠశాలలను స్కూల్ హెల్త్ ప్రోగ్రాంలో చేపడుతున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరిస్తారన్నారు. ఇప్పటికే విద్యార్థులకు జారీ చేసిన హెల్త్ కార్డుల్లో ఆ వివరాలు నమోదు చేస్తామన్నారు. అలాగే ఈ నెల 14 నుంచి సర్వే జరుగుతుందన్నారు. ఈ సర్వే ద్వారా గ్రామాల్లో నాన్ కమ్యూనికల్ డిసీజెస్ వివరాలను సేకరిస్తామన్నారు. బీపీ, షుగర్, రెండు కలిసి ఉన్న వారి వివరాలను ఈ సర్వే ద్వారా సేకరిస్తారన్నారు. రాయవరం పీహెచ్‌సీని సందర్శించిన ఆయన రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలించారు. ప్రభుత్వపరంగా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా జరుగుతున్న పోగ్రామ్స్‌ను ఆయన సమీక్షించారు. సమీక్షలో పీహెచ్‌సీ వైద్యాధికారులు రమ్యశ్రీ, అనిరుధ్, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

మండపేట: ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులందరికీ మెరుగైన వైద్య సేవలు అందించి పంపాలని డీఎంహెచ్‌వో జి. దుర్గారావు దొర వైద్యులను ఆదేశించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సూచనల మేరకు ఆయన బుధవారం మండపేట పర్యటనకు వచ్చారు. స్థానిక ఆసుపత్రిని సందర్శించారు. గొల్లపుంత టిడ్కో కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను, ఎంపీడీవో కార్యాలయం వద్ద గల అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. ఎమ్మెల్యే వేగుళ్లతో కలసి ఆసుపత్రుల పరిసరాలను పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆయన ఆరా తీశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏఎస్ఎంలు కొరత ఉందని స్థానిక ఆసుపత్రి వైద్యులు తెలపగా మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి సిబ్బందిని నియమిస్తామన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు అసౌకర్యానికి గురికాకుండా సకాలంలో స్పందించి మెరుగైన వైద్యంతో ఇంటికి పంపాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామన్నారు.

మహోన్నతుడు ఉండవిల్లి



వీఎస్ఎం కళాశాలలో ఉండవిల్లి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ బోస్

రామచంద్రపురం: రాయవరం మునసబుగా ఖ్యాతి గడించిన ఉండవిల్లి సత్యనారాయణమూర్తి మహోన్నతుడని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్ర బోస్ అన్నారు. స్థానిక వీఎస్ఎం విద్యా సంస్థల ప్రాంగణంలో బుధవారం ఉండవిల్లి 35వ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ బోస్ పాల్గొన్నారు. ముందుగా ఉండవిల్లి సత్యనారాయణ మూర్తి విగ్రహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. అనంతరం బోస్ మాట్లాడుతూ అపర రాజకీయ దురంధరునిగా ఎంతో మందికి మార్గదర్శకులైన ఉండవిల్లి పల్లె ప్రాంత వాసులకు విద్యను దగ్గర చేసి వారి మనసుల్లో చెరగని ముద్ర వేశారన్నారు. ఉండవిల్లితో తనకున్న అనుబంధాన్ని బోస్ గుర్తు చేసుకున్నారు. వీఎస్ఎం విద్యా సంస్థల ప్రెసిడెంట్ అండ్ కరస్పాండెంట్ మెర్ల శివరామప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ మూర్తి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.బాలాజీ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎన్ అలీ అన్సారీ, సిబ్బంది ఉండవిల్లి సత్యనారాయణ మూర్తికి నివాళి అర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, పట్టణ ప్రముఖులు, విశ్రాంత అధ్యాపకులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ పోటీలకు ఐశ్వర్యాంబిక



ఐశ్వర్యాంబికతో హెచ్ఎం వీరరాఘవరెడ్డి

రామచంద్రపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు పట్టణానికి చెందిన శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయోన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని చేకూరి ఐశ్వర్యాంబిక ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు తాడి వీర రాఘవరెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. ఐశ్వర్యాంబిక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి జిల్లా జట్టుకు ఎంపికవ్వడం ద్వారా పల్నాడు జిల్లా నరసారావుపేట మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్- 14 విభాగంలో ప్రతిభ కనబరిచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేసిందన్నారు. దీనితో ఈనెల 17 నుంచి 28 వరకు ఛత్తీస్‌ఘడ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ కెప్టెన్‌గా ఎంపికవ్వడం పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. ఐశ్వర్యాంబికను హెచ్ఎం రాఘవరెడ్డి, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ కేవీఎస్ఎస్ గంగారావు, రామచంద్రపురం బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ స్టాలిన్, ఆల్ ఇండియా బాస్కెట్ బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ గన్నమని చక్రవర్తి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

కాజులూరు: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును పట్టభద్రులు బాధ్యతగా వినియోగించుకోవాలని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ అంగర కృష్ణ అన్నారు. బుధవారం పలు గ్రామాల్లో పట్టభద్రులచే ఓటరు నమోదు చేయించారు.

అత్యాచార నిరోధక చట్టంపై అవగాహన

రావులపాలెం: షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల అత్యాచార నిరోధక చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ ఎస్పీ అస్మ ఫర్హాన్ అన్నారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో ఏపీ క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి



జాయింట్ కలెక్టర్ నిషాంతితో విద్యార్థినులు

మండపేట: ద్వారపూడిలో మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని గ్రామంలోని ఎంజీఎస్‌సీసీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌ను అభ్యర్థించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి బుధవారం ద్వారపూడి వచ్చిన కలెక్టర్ మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ నిషాంతిలను విద్యార్థినులు కలసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. తమ పాఠశాల సమస్యలపై ఈ సందర్భంగా విద్యార్థినులు కలెక్టరుకు విన్నవించారు. పాడైపోయిన పాఠశాలలోని ఆర్వో ప్లాంట్‌ను బాగు చేయించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు ప్రధానోపాధ్యాయురాలు విజయ జ్యోతి తెలిపారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ కంకటాల మురళీకృష్ణ, గ్రామస్తులు యరగతపు బాబ్జీ, చింతా దొరబాబు తదితరులు పాల్గొన్నారు.